ఊపిరి బిగపట్టుకోవాల్సిందే..!

గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక అవస్థలు



నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు. ఇక్కడ మొత్తం 650 మంది విద్యార్థులుండగా 24 స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధన ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 57 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు ఉదయం సమయంలో ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు బయటే స్నానం చేయాల్సి వస్తోంది.



నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోని జ్యోతిరావు పులే బాలుర గురుకుల విద్యాలయంలో 5 నుంచి పదో తరగతి వరకు 480 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 15 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 56 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం. ఇక్కడ ఓ షెడ్డులో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో స్నానానికి, కాలకృత్యాలకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలమూరులో మొత్తం 32 ఎస్సీ, 25 బీసీ, 20 మైనార్టీ, 19 గిరిజన గురుకుల విద్యాలయాలున్నాయి. ఈ గురుకులాల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. నిబంధనల ప్రకారం ప్రతి 25 మందికి స్నానపు గదులు, 4 మరుగుదొడ్లు ఉండాలి. ఈ లెక్కన ఏ గురుకులాల్లోనూ ఇవిలేవు. ఉమ్మడి జిల్లాలో అన్ని గురుకులాల్లో కలిపి సుమారు 6,200 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. ఇందులో సగం కూడా లేనట్లు అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలని...: ఇటీవల ఓ సామాజిక కార్యకర్త రాష్ట్రంలోని పలు గురుకులాల్లో సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. దీని నివేదికను హైకోర్టుకు సమర్పించగా ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక స్నానపు గది, ఏడుగురికి ఒక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించి నివేదిక ఇవ్వాలని గురుకులాలను కోరింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు గురుకులాల్లో సర్వే నిర్వహించగా అందులో ఏ గురుకలాల్లోనూ నిబంధన ప్రకారం సౌకర్యాలు లేవు. కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆరుబయటకు వెళ్లే క్రమంలో కొన్ని చోట్ల పాములు, ఇతర క్రిమికీటకాలతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.



వనపర్తి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో మొత్తం 699 మంది చదువుతున్నారు. వీరికి 50 స్నానపు గదులు, 78 మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ విద్యాలయంలో 83 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. సరిపడా లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోడానికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు వస్తే ఎంతో మేలు..: గురుకులాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేక నిధులు కావాలి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయంలో మరుగుదొడ్ల సమస్య రావడంతో స్థానికంగా ఉన్న సంస్థ తరపున వాటికి మరమ్మతులు చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేయడానికి కూడా ముందుకొచ్చారు. అవసరమైన చోట గురుకులాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

చట్టప్రకారం ఫిర్యాదులకు పరిష్కారం



వినతిని పరిశీలిస్తున్న ఎస్పీ గిరిధర్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పోలీసు ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పోలీసు అధికారులు చట్టప్రకారం పరిష్కరించాలని ఎస్పీ గిరిధర్ ఆదేశించారు. సోమవారం వనపర్తి ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారులిచ్చిన వినతులను ఎస్పీ పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు భార్యాభర్తల ఫిర్యాదు, ఏడు భూతగాదాలకు సంబంధించినవి, మూడు పరస్పర ఫిర్యాదులొచ్చాయి.

నిరీక్షణకు తెర

డీఎస్సీ ఫలితాలు విడుదల ● నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన



విద్యా శాఖ సంచాలకుల ఆదేశాలను నమోదు చేసుకుంటున్న డీఈవో రవీందర్, అధికారులు

పాలమూరు, వనపర్తి పట్టణం, అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల ఎంపిక రాత పరీక్ష (డీఎస్సీ) ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెరుగైన మార్కులు, ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలను నేటి నుంచి 5వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. 2024 డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో 1,131 పోస్టులను ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల క్రితం 20 రోజుల పాటు రాతపరీక్షలు నిర్వహించారు. టెట్‌లో 20, డీఎస్సీ రాత పరీక్షలో 80 చొప్పున మొత్తం 100 మార్కులు ఉంటాయి. ఇందులో ఎక్కువ మార్కులు పొందిన వారికి మాత్రమే పోస్టులు రానున్నాయి. ఎస్జీటీ పోస్టులు కొంతమేరకు ఉన్నా.. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొన్ని సబ్జెక్టుల్లో కేవలం ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఉపాధ్యాయ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను రోస్టరు పాయింట్లు, రిజర్వేషన్ల ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణి నంబరుకు ఎస్ఎంఎస్ లేదా మెయిల్ ఐడీకి మెయిల్ ద్వారా సమాచారం అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో ధ్రువపత్రాల పరిశీలనకు ఏ తేదీన హాజరు కావాలో సమాచారం ఇవ్వనున్నారు. డీఈవోల అధికారిక వెబ్‌సైట్లలో కూడా 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అందుబాటులో ఉంచుతున్నారు. అక్టోబరు 2 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఇస్తున్నారు. పాఠశాలలు సెలవుల తర్వాత 15న ప్రారంభం కానున్నాయి. సెలవుల్లోనే ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. సెలవుల తర్వాత పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 2వేల మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించడంతో చాలా చోట ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయనుండటంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనుంది. విద్యావ్యవస్థ గాడినపడనుంది.

జిల్లాల వారీగా ఇలా పోటీ

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీటీ విభాగంలో 105 పోస్టులు స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉండగా 2,979 మంది పరీక్ష రాశారు. స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రానికి 7 పోస్టులు ఉంటే 763 మంది పరీక్ష రాశారు. ఎస్జీటీలో తుప్పలి శివసాయి అనే అభ్యర్థి 84 మార్కులు తెచ్చుకొని జిల్లాలోనే ప్రథమ ర్యాంకు సాధించాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 111 ఎస్జీటీ పోస్టులకు 3,418 (ఒక్కోదానికి 31) మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సౌమ్య ఎస్జీజీ ఫలితాల్లో 84.90 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. నారాయణపేట జిల్లాలో తెలుగు విభాగంలో 127 ఎస్జీటీ పోస్టులకు 2,608 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ప్రియాంక 87.37 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకును సాధించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్జీటీ విభాగంలో అత్యధిక మార్కులు ఇవే కావటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో తెలుగు మాధ్యమంలో 60 పోస్టులకు 2,694 మంది పరీక్ష రాశారు.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు, అభ్యర్థుల పరిస్థితి..

జిల్లా	మొత్తం అభ్యర్థులు	మొత్తం పోస్టులు	1:3 అభ్యర్థులు
నాగర్‌కర్నూల్	10,072	285	855
మహబూబ్‌నగర్	7,521	243	729
నారాయణపేట	5,972	279	837
గద్వాల	6,474	172	516
వనపర్తి	2,137	152	456

డీఎస్సీ-2024 ఫలితాల్లో 1:3 ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి అక్టోబరు ఐదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, వ్యక్తిగతంగా ఎంపికైనట్లు సమాచారం అందిన అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలు, నకలు ప్రతులతో హాజరు కావాలని వనపర్తి జిల్లా విద్యాధికారి గోవిందరాజులు తెలిపారు.

దసరాకు 649 ప్రత్యేక బస్సులు

నేటి నుంచి అందుబాటులోకి సర్వీసులు

మహబూబ్‌నగర్ పట్టణం, వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని డిపోల



నుంచి ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు 649 ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించారు. నగరాల్లో స్థిరపడిన వారు దసరా పండగ కుటుంబ సభ్యులతో కలిసి చేసుకునేందుకు పల్లెలకు తరలి వస్తారు. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా హైదరాబాద్‌కు బస్సులు నడపనున్నారు. అచ్చంపేట-105, వనపర్తి-95, గద్వాల-89, మహబూబ్‌నగర్-69, కల్వకుర్తి-67, షాద్‌నగర్-59, కొల్లాపూర్-58, నారాయణపేట-54, నాగర్‌కర్నూల్-53 బస్సులను నడపనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో 25 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, షాద్‌నగర్, కొత్తకోట, పెబ్బేరు, మక్తల్, కోస్గి, అయిజ, ఆమన్‌గల్, తెలకపల్లి, డిండి, బిజినేపల్లి, మద్దూర్, మరికల్, గణపూర్ బస్టాండ్ల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

రైతేరాజు 8లో..

తగ్గిన దిగుబడి.. పెరిగిన దిగుమతి

భారంగా మారిన ఉల్లి ధరల పెరుగుదల



దేవరకద్రలో ఉల్లిని విక్రయిస్తున్న రైతులు

పెరిగిన ధరలు (రూ.ల్లో) ఇలా..

నెల	క్వింటాలు	కిలో
జులై	2,000	20
ఆగస్టు	3,500	40
సెప్టెంబరు	5,600	60

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం, దేవరకద్ర గ్రామీణం : ఏ కూర వండాలన్నా ఉల్లి ఉండాల్సిందే.. ఆ ఉల్లి ధరలే పెరిగిపోవటం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బందికరంగా మారింది. గతేడాది ఉల్లి సాగు చేసిన రైతులు మార్కెట్లో సరైన ధరలు లేక తక్కువ ధరలకు అమ్ముకున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న రైతులు ఈసారి పెద్దగా సాగు చేయలేకపోయారు. వర్షాలు ఆలస్యం కావటం కూడా ఇందుకు కారణం. ఫలితంగా ఉల్లిపంట కొరత ఏర్పడి ధర పెరిగిపోతోంది.

వర్షాలతో దెబ్బతిన్న పంట : వీపనగండ్ల, తిమ్మాజిపేట, వనపర్తి, పెబ్బేరు, ఊట్కూర్, నారాయణపేట, మక్తల్, నవాబుపేట, బాలానగర్, కల్వకుర్తి, ఊర్కొండపేట, మిడ్జిల్, బిజినేపల్లి, గండీడ్, మహమ్మదాబాద్ తదితర మండలాల్లో ఉల్లిని ఎక్కువగా సాగు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 3,600 ఎకరాల్లో సాగయ్యే ఉల్లి పంట ఈసారి 1,200 ఎకరాలకు పడిపోయింది. ఇటీవలి వర్షాలతో ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన కొద్దిపాటి ఉల్లిపంట కూడా దెబ్బతింది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూ వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాకాలంలో 52 ఎకరాలు, జోగులాంబ గద్వాల జిల్లాలో 87 ఎకరాల్లోపే ఉల్లి సాగైంది. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 2,800 ఎకరాల్లో ఉల్లి సాగయ్యేది. ఈసారి 971 ఎకరాల్లోపే సాగైంది. నారాయణపేట జిల్లాలో 340 ఎకరాలకు గాను 86 ఎకరాల్లో సాగైంది.

వర్షాలతో పంట దెబ్బతినటంతో కర్నూలు, నందికొట్కూరు, మంత్రాలయం, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు ఉల్లి రాలేదు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు మహారాష్ట్రలోని నాసిక్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవటంతో ధర మూడింతలు పెరిగింది. క్వింటా ఉల్లి ధర జులైలో రూ.2,000 ఉండగా.. సెప్టెంబరులో రూ.5,600లకు పెరిగింది. కిలో ఉల్లి ధర జులైలో రూ.15 నుంచి రూ.20 ఉండగా.. ఇప్పుడు రూ.60కి పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యాన అధికారి కె.వేణుగోపాల్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగు తగ్గటం, వర్షాలతో పంట దెబ్బతినటమే ధరల పెరుగుదలకు కారణమన్నారు. యాసంగిలో పంట సాగు పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.



భారంగా మారింది.. : ఏ కూర వండలన్నా ఉల్లి తప్పనిసరి. పెరిగిన ఉల్లి ధరలు మాకు భారంగా మారాయి. వారానికి 3 కిలోల వరకు ఉల్లి వినియోగిస్తాం. పెరిగిన ఉల్లి ధరలతో కొనుగోలు చేయలేకపోతున్నాం. ఉల్లి ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

- సంధ్యారాణి, మహిళ, గూరకొండ



రైతుకు లాభం లేదు.. : మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. రైతులు మార్కెట్‌కు పంట తీసుకెళ్తే క్వింటాకు రూ.2,500 నుంచి రూ.3,500 వరకే ఇస్తున్నారు. పేరుకే ఒకరిద్దరు రైతులకు రూ.5వేల చొప్పున చెల్లిస్తున్నారు. పెరిగిన ధర రైతులకు కూడా చెల్లించాలి.

- భగవంతు, రైతు, దేవరకద్ర

మిల్లులు తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, పాల్గొన్న అదనపు కలెక్టర్ నగేశ్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం వాస్తవంగా ఉన్నాయా లేదా అనేది రైస్ మిల్లులను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖాధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో పౌరసరఫరాలశాఖ అధికారులతో సీఎంఆర్ సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మిల్లర్ల నుంచి రోజు వారీగా బియ్యం సేకరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిల్లర్ల నుంచి బియ్యం ఇప్పించే బాధ్యత ఉప తహసీల్దార్లు తీసుకోవాలన్నారు. కాలయాపన చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్టోబరు 5న ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ గుత్తేదారులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులతో జిల్లా స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సారి సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం నుంచి రూ.500 ప్రోత్సాహకం ఇస్తున్నందున ఎక్కువ ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశముందని, అందుకు తగ్గట్టుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, డీఎస్‌వో కాశీవిశ్వనాథ్, జిల్లా వ్యవసాయాధికారి గోవిందునాయక్, మార్కెటింగ్ జిల్లా అధికారి స్వరణ్‌సింగ్, కోఆపరేటివ్ జిల్లా అధికారి ప్రసాదరావు, తూనికలు కొలతల జిల్లా అధికారి సత్యనారాయణ, డీపీఎం అరుణ, డీఎం ఇర్ఫాన్, ఉపతహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు అత్యధిక పనుల కల్పనకు ప్రణాళిక

వనపర్తి న్యూటౌన్: ఉపాధి హామీ పథకం కూలీలకు 2025-26 సంవత్సరంలో అత్యధిక పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ అన్నారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధిశాఖ, జడ్పీ, ఎంపీడీవోలు, ఏపీవోలు, క్షేత్రసహాయకులతో ఉపాధి హామీ పథకం 2025-26 పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పనుల ఎంపిక, తయారు చేయాల్సిన ప్రణాళిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామసభల నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఉమాదేవి, జడ్పీ సీఈవో యాదయ్య, అదనపు డీఆర్‌డీవో రామహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈవోలు,. సాంకేతిక, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు



వినతిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : సీఎం కార్యాలయం నుంచి, జిల్లా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ ఆదేశించారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు అదనపు కలెక్టర్(రెవెన్యూ) నగేశ్ ఫిర్యాదులు తీసుకున్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన 297 ఫిర్యాదులకు గాను 114 పరిష్కరించామని, మిగతా వాటిని అక్టోబరు 3 నాటికి పరిష్కరించాలని సంబంధితాధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 55 ఫిర్యాదులు అందాయి.

రెవెన్యూ సేవలు కొనసాగించాలి

ఏదులతో పాటు మాచుపల్లి, సింగాయిపల్లి, తుర్కదిన్నె, ముత్తిరెడ్డిపల్లి, రేకులపల్లితండా, గుండ్యానాయక్ గ్రామాలను కలిసి ఏదుల మండలంలో కలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సేవలు, రెవెన్యూకు సంబంధించిన సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. కోడేరు మండలానికి వెళ్లాలంటే 20 కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తోంది.

- ఏదుల మండల రైతులు

భూమి పట్టా చేయించండి

మాది ఖిల్లాగణపురం మండలం, వెంకటాంపల్లి గ్రామం. 30.20 ఎకరాల భూమి ఉంది. మా పెద్ద కుమారుడు నాగేశ్వర్‌రెడ్డి సీఐ, చిన్న కుమారుడు యాదిరెడ్డి అలియాస్ యాదయ్య కానిస్టేబుల్. మాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిపై 3.32 ఎకరాలు, మిగతా 26.31 ఎకరాలు కుమారులపై పట్టా చేశాం. మా బాగోగులను పట్టించుకోవడం లేదు. మా కుమారులపై చేయించిన పట్టా భూమిని తిరిగి వయోవృద్ధుల చట్టం ప్రకారం మాపై పట్టా చేయించాలి.

- రఘునాథ్‌రెడ్డి, బొజ్జమ్మ, దంపతులు

ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వండి

పెబ్బేరు మండలం రంగాపురం గ్రామ శివారు వాగులో ఇసుక ఉంది. జీవనోపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నాం. వలస వెళ్లే పరిస్థితి ఉంది. వాగు నుంచి ఇసుక ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అనుమతి ఇవ్వండి.

- రంగాపురం, గ్రామస్థులు

హిందువుల మనోభావాలతో చెలగాటం

తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే ఆవు నెయ్యికి బదులుగా అనేక రకాలైన కొవ్వు పదార్థాలతో తయారు చేసి అపవిత్రం, అపఖ్యాతి పాలు చేశారు. దేవాలయ నిర్వహణ విషయంలో ఈ ఘటన బాధాకరమైంది. హిందూ మనోభావాలతో చెలగాటమాడుతున్న వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి.

- విశ్వహిందూ పరిషత్ నాయకులు

నియంత్రికలకు ఎదురుచూపులు



పెబ్బేరు మండలం పెంచికలపాడు శివారులో పొలాలకు కర్రలపై విద్యుత్తు తీగలను తీసుకెళ్లిన రైతులు

పెబ్బేరు, న్యూస్‌టుడే : వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం రైతులు డీడీలు చెల్లించి ఏళ్లు కావస్తున్నా నియంత్రికలు మంజూరు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 5,717 మంది ఎదురుచూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుంచి పెండింగ్‌లో ఉన్నాయంటే అధికారుల పనితీరు ఏంటో తెలుస్తోంది. అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పనిదే మంజూరు కావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గతేడాది జనవరిలో పెబ్బేరులో విద్యుత్తు నియంత్రణ కమిషన్ (ఈఆర్‌సీ) ఛైర్మన్ శ్రీరంగారావుకు ఉమ్మడి జిల్లా రైతులు మొరపెట్టుకొన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై ఈఆర్‌సీ ఛైర్మన్ విద్యుత్తు ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం టీజీఎస్పీడీసీఎల్ (విద్యుత్తు) ఎస్ఈ, డీఈఈ, ఏఈ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే.

ఏళ్ల తరబడిగా నిరీక్షణ..

- ఖిల్లాగణపురం మండలంలో 2013లో అయిదు మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే నేటికీ వారికి నియంత్రికలు మంజూరు కాలేదు. 2016లో ఒకరు, 2022 నుంచి నేటి వరకు 154 మంది రైతులు నియంత్రికల కోసం ఎదురు చూస్తున్నారు.
- పాన్‌గల్ మండలంలో 2014లో నలుగురు, 2015లో అయిదుగురు, 2018లో 9మంది, 2019 నుంచి నేటి వరకు 624 మందికి మంజూరు చేయలేదు.
- వనపర్తి రూరల్‌లో 2014లో ఇద్దరు, 2015లో ఒకరు, 2021 నుంచి ఇప్పటి వరకు 433 మందికి ఇవ్వలేదు.
- పెబ్బేరు మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 1,010 మంది రైతులకు నియంత్రికలు ఇవ్వలేదు. వీరి దరఖాస్తులన్ని పెండింగ్‌లోనే ఉన్నాయి.

మండలం	ఎప్పటి నుంచి	రైతులు
అమరచింత	2021-2024	130
ఆత్మకూరు	2015-2024	136
చిన్నంబావి	2023-2024	451
ఖిల్లాగణపురం	2013-2024	160
గోపాల్‌పేట	2017-2024	373
కొత్తకోట	2018-2024	663
మదనాపురం	2020-2024	204
పాన్‌గల్	2014-2024	642
పెబ్బేరు	2017-2024	1,010
పెద్దమందడి	2022-2024	316
రేవల్లి	2018-2024	265
శ్రీరంగాపురం	2017-2024	213
వనపర్తి	2022-2024	56
వనపర్తి రూరల్	2014-2024	436
వీపనగండ్ల	2015-2024	662

డబ్బులిస్తేనే పనులు..

విద్యుత్తుకు సంబంధించి ఏ పని కావాలన్నా సంబంధిత సిబ్బంది మొదలుకొని పైస్థాయి అధికారుల వరకు పైకమివ్వనిదే పనులు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ నియంత్రికల వద్ద ఎలాంటి సమస్య ఉన్నా డబ్బులిచ్చి సిబ్బందిని తీసుకెళ్లాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో కొందరు లైన్‌మెన్లు సొంతంగా సహాయకులను నియమించుకున్నారు. వారి చేత పనులు చేయిస్తున్నారు.

సమస్య పరిశీలిస్తాం

నేను కొత్తగా వచ్చాను. 2013 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉండకూడదు. సమస్య ఏంటో తెలుసుకుంటాను. డీడీలు చెల్లించి దరఖాస్తు చేసుకున్న రైతులకు క్రమంగా అందజేస్తున్నాం. చాలా ఏళ్లుగా సమస్య ఉంటే రైతులు వస్తే పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తాం. విద్యుత్తు ఉద్యోగులు లంచాలు తీసుకోవద్దని ఇదివరకే ఆదేశించాం. మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి గట్టిగా ఆదేశిస్తాం.

- రాజశేఖర్, ఎస్ఈ (టీజీఎస్పీడీసీఎల్), వనపర్తి

ఆకుకూర.. తినివేరా!

- చవగ్గా అందుబాటులో పోషకాహారం
- నేడు శాకాహార దినోత్సవం



పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లలో కొవ్వులేక పోవడం వలన గుండె జబ్బులు దరిచేరవు. ఆకుకూరలు, కూరగాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలు దరిచేరనివ్వవని సర్వేలు చెబుతున్నాయి. శాకాహారంలో ఆకుకూరలకు ప్రాధాన్యం ఉండటమే కాకుండా ఎలాంటి ఖర్చులేకుండా ఇంటి పరిసరాల్లోనూ పండించుకోవచ్చు.

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

తొలిసారి 1977లో..

పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడేదిశగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని జరుపుకొంటారు. తొలిసారి 1977లో అమెరికాలో నిర్వహించారు. శాకాహార ప్రాముఖ్యత, విలువలను ప్రపంచానికి వివరించేందుకు ఇప్పటివరకు వందలాది సదస్సులను నిర్వహించారు.

అందుబాటులో ఆరోగ్యం: భారతదేశంలో అనాదిగా శాకాహారానికి ఉన్న ప్రాధాన్యం గొప్పది. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రకృతి ఇచ్చిన వరం ఆకుకూరలు. రోజూ ఏదో ఒక ఆకుకూరను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం కోసం రూ. వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు. జీవన శైలిని మార్చే సత్తా ఆకుకూరలకు ఉందని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు. ఆకుకూరల్లో తక్కువ కొవ్వు ఉండటం, అధిక ప్రొటీన్లు, ఖనిజలవణాలు అధికం. పెరడు, ఇంటి మిద్దెలపై ఖాళీ డబ్బాలు, కుండీలను వినియోగించి ఇంటికి కావాల్సిన తాజా ఆకుకూరలను పండించుకోవచ్చు.



తోటకూర : ఆకుకూరల్లో ఎక్కువమంది ఇష్టపడే తోటకూరలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలతో పాటూ, అనేక పోషకాలున్నాయి. తోటకూరను ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. క్యాన్సర్‌ని నిరోధిస్తుంది. త్వరగా జీర్ణమవడంతో పాటూ, జలుబు, జ్వరం వంటి చిన్న రోగాల బారిన పడకుండా కాపాడుతుంది. విత్తిన నాటి నుంచి 25 నుంచి 30 రోజుల్లోపు కోతకు వస్తుంది.



గోంగూర (పుంటి కూర) : గోంగూరతో చాలా లాభాలున్నాయి. తినడానికి కాస్త పుల్లగా అనిపించినా.. గోంగూర తరుచూ తినడం వలన రక్తహీనత సమస్య దరిచేరదు. గుండెకు బలం చేకూరుతుంది. గోంగూరను బాగా ఉడకబెట్టి పుండ్లపై కడితే అవి త్వరగా మానుతాయి. గోంగూర నిల్వ పచ్చడిగా వినియోగించుకోవచ్చు. విత్తిన నాటి నుంచి 15 నుంచి 20 రోజుల్లోగా గోంగూర ఆకులను ఆహారంగా తీసుకోవచ్చు.


బచ్చలి కూర : బచ్చలికూర గ్రామాల్లో విరివిగా లభిస్తుంది. ఆహారంలో తరచూ వాడటం వలన ఒంట్లో వేడి క్రమేపి తగ్గుతుంది. మూత్రంలో మంట, ఇన్‌ఫెక్షన్లపై ప్రభావం చూపుతుంది. బచ్చలి కూరను కూడా కుండీలు, ఇంటి ఆవరణలో సులభంగా పెంచుకోవచ్చు. నాటిన 30 నుంచి 35 రోజుల వ్యవధిలో కోతకు వస్తుంది.



పాల కూర : పాల కూరకు రక్తాన్ని శుద్ధి చేసే తత్వం ఉంటుంది. పాలకూరలో విటమిన్ సి, ఏ, మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్ వంటివి క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో తోడ్పడతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్‌ను అదుపుచేయడంలో పాల కూర ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ ఆకుకూర వాత, పిత్త, కఫ దోషాలను నివారిస్తుంది. విత్తనం నాటిన 20 -25 రోజుల నుంచి పాలకూరను ఆహారంగా వినియోగించవచ్చు.



కంటి చూపునకు పొన్నగంటి కూర : పొన్నగంటి కూర శరీరానికి చలువ చేస్తుంది. కంటి చూపు సమస్యతో బాధ పడేవారికి పొన్నగంటి కూర చాలా మేలు చేస్తుంది. నిత్యం ఆహారంలో తీసుకోవడం వలన కంటి చూపు మెరుగుపడుతుంది. పొన్నగంటి కూర సహజసిద్ధంగా పొలం గట్లపై వర్షాకాలంలో లభిస్తుంది.



అందుబాటులో అధిక పోషకాలు..: సహజసిద్ధంగా పంట పొలాల్లో పెరిగే జొన్నచెంచలి, గోగ్గలి, ఎల్లచెవుకూర, తగరించ, పాయలాకు, తల్లెలా, గుప్పెరేణి, గునుగు, తుమ్మి, పొన్నగంటి, నల్లకాశ, తెల్లకాశ, బుడ్డకాశ, గోరుమడి, సన్నపాయల, తెల్లగరిజల, చెన్నంగి, యెన్నాద్రి, ఆవిసె, నోరుకూర, చిత్రమాశ, అంగిబింగి, అడవి పుల్లకూర, బంకిలి పూల, నల్లదేగ జిలేరి, ముల్లుదోగ్గలి, ఫుల పత్రం, గంగవాయిలి వంటి సహజంగా లభించే ఆకుకూరలను ప్రజలు ఆహారంగా తీసుకోవడం లేదు. వాణిజ్యంగా సాగు చేసిన ఆకుకూరలతో పోల్చినా వీటిలో అధిక మొత్తంలో సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్లు ఉన్నాయి. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కేవీకే ఆధ్వర్యంలో ప్రకృతిలో లభించే ఆకుకూరలపై అవగాహన కల్పిస్తున్నాం.



- హేమలత, గృహ విజ్ఞానశాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జహీరాబాద్

పెరట్లోనే కూరగాయలు..: 30 ఏళ్లుగా పెరటితోటలో పెంపకం ద్వారానే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను. నిత్యం తీసుకునే ఆహారంలో ఏదో ఒక ఆకుకూర తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తవు. ఇంటి బయట ఖాళీ స్థలం లేని వారు, మిద్దెపై కుండీల్లోనూ కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసుకోవచ్చు.

- శారద, విశ్రాంత ఉపాధ్యాయిని, పాలెం




పెరటితోట సాగులో విశ్రాంత ఉపాధ్యాయురాలు శారద

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లా	కూరగాయల సాగు	ఉత్పత్తి (సుమారు టన్నుల్లో)
నారాయణపేట	2,217	26,075
మహబూబ్‌నగర్	1,986	18,795
జోగులాంబ గద్వాల	4,585	52,350
నాగర్‌కర్నూల్	1,890	20,892
వనపర్తి	1,719	19,780

పొగాకు నారు మడి.. అధిక రాబడి

మల్దకల్, న్యూస్‌టుడే : సంప్రదాయ పంటలు సాగుచేసి ఆశించిన స్థాయిలో దిగుబడి దక్కక, గిట్టుబాటు ధరలు లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఓ రైతు మిత్రుడి సలహాతో పొగాకు నారు సాగు చేసి లాభాల బాటలో పయనిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన పెద్ద తిమ్మోతి 30 గుంటల్లో పొగాకు నారు పెంపకం చేపట్టారు. పొడవు 40 అడుగులు, వెడల్పు మూడు అడుగుల ప్రకారం 150 బెడ్లు ఏర్పాటు చేసుకుని జులై చివరి వారంలో విత్తనాలు చల్లారు. అంతకు ముందు పొలంలో రెండు ట్రాక్టర్ల పశువుల ఎరువుతో పాటు సేంద్రియ ఎరువు వేసి కలియదున్నారు. బిందు సేద్యం పరికరాలతో నీటితడులు అందించారు. 55 నుంచి 60 రోజుల వరకు పొలంలో నాటడానికి అనుకూలంగా ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఇక్కడికే వచ్చి నారు తీసుకెళ్తున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీలు, బెడ్ల తయారీ, ఇతరత్రా అవసరాలకు రూ.1.10 లక్షలు వరకు ఖర్చయినట్లు రైతు తెలిపారు. 120 బెడ్ల నారు విక్రయించగా రూ.2.50 లక్షలు వచ్చాయన్నారు. రూ.1.40 లక్షలు ఆదాయం పొందినట్లు పేర్కొన్నారు. ఇంకా 30 బెడ్ల నారు ఉందని తెలిపారు.



నారుమడిలో కలుపు తీస్తున్న రైతు పెద్దతిమ్మోతి

రైతేరాజు

పొలం వద్దే కొనుగోళ్లు: పొగాకు బెడ్లలో కలుపు నివారణకు కూలీలు అవసరం. కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నా. కర్ణాటకతో పాటు గట్టు, ఇటిక్యాల, గద్వాల మండలాలకు చెందిన రైతులు పొలం వద్దకే వచ్చి నారు కొనుగోలు చేస్తున్నారు. ఆరేళ్లుగా నారు పెంచి విక్రయిస్తున్నా. ఈఏడాది అనుకూలంగా వర్షాలు కురిశాయి. మంచి గిరాకీతో పాటు ధర అధికంగా పలికి లాభాలు వచ్చాయి.

- పెద్దతిమ్మోతి రైతు, తాటికుంట, మల్దకల్‌మండలం

ప్రశ్నలు - సమాధానాలు

? వరి ఆకునల్లి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- కృష్ణయ్య, దంతనూర్

✔ గంధకం 3 గ్రాములు లేదా ఫాపర్‌గేట్ 2 మి.లీ లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో సూదిపురుగు (పిన్‌వార్మ్) నివారణకు చర్యలు తెలపండి.

- రామకృష్ణ, మున్ననూర్

✔ లీటరు నీటిలో ఇండాక్సీకార్బ్ 1.75 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా డెల్టామిత్రిన్ 1 మి.లీ లేదా ల్యామ్డా సైహాలోత్రిన్ 1 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? కందిలో మారుక గూడుపురుగు నివారణకు ఎలాంటి మందులు వాడాలి?

- స్వామి, చెన్నారం

✔ నివారణకు వేపమందు (1500పీపీఎం) 5 మి.లీ, న్యూవులురాన్ 1 మి.లీ లేదా క్లోరాంట్రీనిపోల్ 0.3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

- న్యూస్‌టుడే, మదనాపురం

వేరుసెనగలో సస్యరక్షణ పాటిస్తే దిగుబడులు

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతల అవగాహన నిమిత్తం సోమవారం నుంచి రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య వరదాయినిలో 94408 35658కు ఫోన్ చేసే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మదనాపురం, న్యూస్‌టుడే : యాసంగిలో సాగుచేసే వేరుసెనగలో కలుపు, చీడపీడల నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. బీజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరి తాంధ్ర, ధరణి, జేఎల్ 24, జగిత్యాల పల్లి 1, టీసీజీఎస్ 1694 అనువైన రకాలని పేర్కొన్నారు.



సాగు చేసిన వేరుసెనగ

విత్తనశుద్ధి : విత్తనాన్ని టెబ్యుకోనజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి ముదట చేసుకుని ఆపైన ట్రైకోడర్మా 10 గ్రాములు, రైజోబియం 5 గ్రాములు విత్తనం వేసే 2 గంటల ముందు కలుపు కొని విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం : భాస్వరం, పొటాష్ ఎరువులు విత్తే సమయంలోనే వేయాలి. ఎకరానికి 100 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా వేసుకోవాలి.

కలుపు నివారణకు..: విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపల కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరును ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి నేలపై పిచికారీ చేసుకోవాలి. గడ్డిజాతి మొక్కల నివారణకు ఎకరానికి క్విజాలోఫాప్ ఇథైల్ ఎకరాకు 400 మి.లీ లేదా ప్రొపాక్విజాఫాప్ ఇథైల్ ఎకరాకు 250 మి.లీ విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవాలి.

చీడపీడల యాజమాన్యం : లద్దె పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటి దశలో 5 మి.లీ వేపమందు (ఎన్‌ఎస్‌కేఈ)ను క్లోరోపైరిఫాస్ 50ఈసీ 1.5 మి.లీ లేదా న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మంత్రులకు దసరా ఉత్సవాల ఆహ్వానం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వానం పలుకుతున్న ఈవో పురేందర్, అర్చకుడు ఆనంద్‌శర్మ

అలంపూర్,న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు అలంపూర్ ఆలయాల్లో ఉత్సవాలకు హాజరవ్వాలని మంత్రులకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణకు ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు వద్ద 68 వేల క్యూసెక్కుల వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.151, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.526 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలంలో ఎగువన 121.716, దిగువన 186.736 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

పాలమూరు క్రికెట్ జట్టు హ్యాట్రిక్

అర్ధ శతకాలు సాధించిన అభిలాష్, అబ్దుల్ రాఫె, షాదాబ్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి వన్డే టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మెదక్‌పై గెలుపొంది హ్యాట్రిక్ సాధించింది. సోమవారం హన్మకొండలో నిర్వహించిన మూడో వన్డేలో మెదక్‌పై 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ముగ్గురు అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అభిలాష్ 66, అబ్దుల్ రాఫె 54, షాదాబ్ అహ్మద్ 53 పరుగులు చేశారు. అనంతరం లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. జిల్లా జట్టు నుంచి షాదాబ్ 4, అంకిత్ రాయ్, ముఖీత్ చెరో 2 వికెట్లు తీశారు. విజయం సాధించిన పాలమూరు జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు



అవస్థలిలా.. చదువులు సాగేదెలా..!

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 226 మంది చదువుకుంటున్నారు. వీరిలో 110 మంది విద్యార్థినులున్నారు. అందరికీ కలిపి పాఠశాల ఆవరణలో ఒక యూనిట్ మూత్రశాల మాత్రమే ఉంది. విద్యార్థినులు నిత్యం ఇలా బారులుదీరి నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి అసౌకర్యాలతో చదువుపైనా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. 116 మంది బాలురు ఆరుబయటకు వెళ్లాల్సిందే. 'మన ఊరు-మన బడి'లో మరో యూనిట్ మూత్రశాల మంజూరైనా నిర్మాణం చేపట్టలేదు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల బదిలీపై వచ్చానని, సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. **- న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం**

బతుకమ్మ పాఠం.. చరిత్రకు అద్దం



బతుకమ్మలతో మహిళలు

కొత్తకోట, న్యూస్‌టుడే : తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది బతుకమ్మ పండగ. ఇది దేశంలో అరుదైన పూల పండగ. ఏళ్ల క్రితమే మరుగున పడిన ఈ వేడుక.. రాష్ట్రం ఆవిర్భావం అనంతరం పూర్వ వైభవం సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు మహిళలు ఎంతో ఇష్టంగా జరుపుకొంటారు. ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పండగ విశిష్టతను విద్యార్థి దశలోనే తెలిసేలా పాఠ్య పుస్తకాల్లో వీటిని చక్కగా వివరించారు. బుధవారం నుంచి జరుపుకొనే ఈ పండగ విశేషాలపై పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలపై 'న్యూస్‌టుడే' కథనం..

ఇది కథ..

బతుకమ్మ గురించి ఏడో తరగతి ఉపవాచకంలో 'మన పండగలు' పాఠ్యాంశంలో చక్కగా వివరించారు. 'చోళరాజు అయిన ధర్మాంగదునికి వందమంది కుమారులు సంతానం. వారంతా యుద్ధంలో మృతి చెందుతారు. చాలా కాలం తరువాత లక్ష్మీదేవి అనుగ్రహంతో ఓ ఆడపిల్ల పుడుతుంది. ఈ పాపకు బతుకమ్మ అని పేరు పెట్టి నిండూనూరేళ్ల బతకాలని అందరూ ఆశీర్వదిస్తారు.' ఆ అమ్మాయే బతుకమ్మగా పూజలందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే గునుగు చామంతి, తోక చామంతి. తంగేడు, కట్ల, పిట్టకాలి, ఎర్రగన్నేరు, రుద్రాక్ష, బీర గుమ్మడి, ముద్దబంతి వంటి రంగురంగుల పూలు సేకరించి చక్కగా పేర్చి పైన పసుపు ముద్దను నిలిపి గౌరీదేవిగా కొలుస్తారు. ప్రతి రోజూ సాయంత్రం ఆడుకొని చెరువులో నిమజ్జనం చేస్తారు.

రోజుకో తీరు..

తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను పిలిచి కొలుస్తారు. తొమ్మిది రకాల ఫలాలు సమర్పిస్తారు. ప్రతి రోజు ప్రత్యేకంగా ఫలహారం నైవేద్యంగా పెడతారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, ఐదో రోజు అట్ల బతుకమ్మను కొలుస్తారు. ఆరో రోజును అర్రెమి అంటారు. ఎవరి ఇళ్ల వద్ద వారే ఆటలాడుకుంటారు. ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకం

తొమ్మిదో రోజు దసరాకు ఒకటి, రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకొంటారు. ఆరోజు కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటారు. కొత్త దుస్తులు ధరిస్తారు. ఆడబిడ్డలను, బంధువులను పిలుచుకుంటారు. బతుకమ్మను ఎత్తుకొని సద్దులు తీసుకుని ఆడుకున్న తరువాత చెరువుకు వెళ్తారు. జొన్న, మక్క పిండి, బెల్లం, పెసరపిండి, నెయ్యితో చేసిన పదార్థాలు, సత్తుపిండి, దోసకాయ, పెసరపప్పు, బెల్లంతో సద్దులు తయారు చేస్తారు. చెరువు వద్ద బతుకమ్మలను దించి మరోసారి ఆడుకుని చెరువులోకి సాగనంపుతారు. అనంతరం తెచ్చిన సద్దులను ఒకరినొకరు పంచుకుంటారు.

ఆట, పాటల్లో సాహిత్యం

'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ అమ్మలక్కలు, ఆడపడుచులు ఎంతో ఇష్టంగా ఆటపాటలు లయబద్ధంగా ఆడి పాడుతుంటారు. ప్రతి పాటలోనూ గౌరమ్మనే ఆరాధిస్తారు. ఇందులో గొప్ప సాహిత్యం ఉంటుంది. ఎక్కువగా ఆడపిల్లల జీవితాలు, కష్టాలు, అత్తవారింట్లో ఎదుర్కొనే సమస్యలు పాటల రూపంలో బయటకు వస్తుంటాయి.

సంస్కృతి చాటి చెప్పేలా..

పాఠ్యపుస్తకాల్లో సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా పాఠ్యాంశాలు ఎంతో అవసరం. వీటి వల్ల పాఠశాల దశలోనే విద్యార్థికి మన చరిత్ర తెలుస్తుంది. పండగ అంటే ఏదో కుటుంబ సభ్యులంతా కలిసి మంచి భోజనం చేయడం కాదని అందులో విశేషం ఉందని గ్రహిస్తారు. ఇలాంటి పాఠ్యాంశాలు నేటి తరానికి ఎంతో అవసరం.

- కోట్ల వనజాత, రచయిత్రి, మహబూబ్‌నగర్

అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగు



చెన్నపోళ్ల జయమ్మ

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ మహిళ గత వారం రోజులుగా మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచే సమయంలో అవయవదానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపింది. మక్తల్ శివాజీనగర్‌కు చెందిన చాకలి జయమ్మ గత మంగళవారం మాగనూరు మండలంలోని నల్లగట్టు మారెమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. ఆలయం వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని అక్కడి వైద్యులు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు జయమ్మ భర్త లక్ష్మణ్, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అంగీకరించారు. సరోజిని కంట ఆస్పత్రికి ఒకరికి కళ్లు అమర్చగా, పదోతరగతి విద్యార్థికి కిడ్నీ అమర్చారు. ఇతర అవయవాలు మరికొందరికి అమర్చుతామని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. జయమ్మ మృతదేహాన్ని సోమవారం మక్తల్ తీసుకొచ్చారు. పట్టణ ప్రజలు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తూ ఇంటి వరకు ఊరేగింపుగా మృతదేహంతోపాటు వెళ్లారు.

చోరీ కేసుల్లో నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానందం, ముసుగులో నిందితులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : కొన్ని రోజులుగా జడ్చర్ల పట్టణంలోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను జడ్చర్ల పోలీసులు సోమవారం పట్టుకుని రిమాండుకు తరలించారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానంద్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద నివాసముండే చిట్యాల రవి, వేంకటేశ్వర కాలనీలో ఉండే లింగాల మహేశ్ కలిసి తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తూ వాటిలో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు జులై 30న పట్టణంలోని భవానీనగర్‌లోని వడ్ల గోపి, ఆగస్టు 19న మమతనగర్ సమీపంలో నరేంద్రసాగర్, గత నెల 14న తాలుకా క్లబ్ రోడ్డులోని హసల్ అలీలకు చెందిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తాలుకా క్లబ్ రోడ్డులోని సీసీ కెమెరాల పుటేజీలో నిందితులు ఉన్నాయి. వారిని పట్టుకుని విచారించగా చోరీలు చేశామని ఒప్పుకొన్నారు. వారి నుంచి మూడు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నగదు మాత్రం లభించలేదు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన పోలీసు సిబ్బంది నర్సింహ, విష్ణులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు
మహబూబ్‌నగర్: 8074538150 వనపర్తి, నాగర్‌కర్నూల్: 8008573864
అమరచింత: 9490237200 పెబ్బేరు: 9121229043

సమస్య : పట్టణంలోని ముస్లిం శ్మశాన వాటికలో ప్రైవేటు ఆసుపత్రుల వారు సూదులు, సిరంజీలు, మందు సీసాలు, డబ్బాలు వేస్తున్నారు. శ్మశాన వాటికను అపరిశుభ్రం చేస్తున్నారు. అనంతర సమయంలో శ్మశాన వాటికకు వెళ్లిన వారికి సూదులు గుచ్చుకుంటున్నాయి.



- ఖదీర్, అమరచింత

సమాధానం : ముస్లిం శ్మశాన వాటికలో ప్రైవేటు ఆసుపత్రుల వారు చెత్త వేయకుండా పురపాలక సంఘం నుంచి తాఖీదులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం.

- నూరుల్ నజీబ్, పుర కమిషనర్, అమరచింత

– న్యూస్‌టుడే, అమరచింత

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర.** వెంకటేశ్వర: **సత్యం సుందరం**

– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలానికి చెందిన పలువురు యువతి, యువకులు ప్రతిభ కనబరిచారు. తెలుగు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో నిర్విన్‌కు చెందిన ఎం.వంశీ 74.10 మార్కులు, తెలుగు పండిట్ విభాగంలో 76.10 మార్కులు సాధించి నాలుగో స్థానంలో నిలిచాడు. కనిమెట్టకు చెందిన ఎం.రమేశ్ ఎస్టీ విభాగంలో 80.53 మార్కులు సాధించి నాలుగో స్థానంలో, కానాయపల్లికి చెందిన జి.లక్ష్మి ఎస్టీ విభాగంలో 81.10 మార్కులతో జిల్లా మొదటి స్థానం, కానాయపల్లికి చెందిన పి.మంజుల బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 79.12 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు.



ఎం.వంశీ, రమేశ్, పి.లక్ష్మి, పి.మంజుల



సుష్మిత, రవికుమార్, తేజేశ్వర్ గౌడ్

మెరుగైన ర్యాంకులు

చిన్నంబావి, న్యూస్‌టుడే : డీఎస్సీ ఫలితాల్లో చిన్నంబావి మండలం అయ్యవారిపల్లికి చెందిన తేజేశ్వర్ గౌడ్, వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన సుష్మిత, రవికుమార్ మెరుగైన ర్యాంకులు సాధించారు. జీవశాస్త్రం విభాగంలో తేజేశ్వర్ గౌడ్ జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు, భౌతిక శాస్త్రం విభాగంలో రవికుమార్ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు, ఎస్జీటీ విభాగంలో సుష్మిత 14వ ర్యాంకు సాధించారు.

పామిరెడ్డిపల్లె వాసికి రెండో ర్యాంకు




అమరచింత, న్యూస్‌టుడే : డీఎస్సీ ఫలితాల్లో అమరచింత మండలం పామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు. గురుకుల ఫలితాల్లో ఉద్యోగం సాధించడంతో ఆయన ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఎస్‌ఏ ఆంగ్లంలో ద్వితీయ స్థానం



పాన్‌గల్, న్యూస్‌టుడే : మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరయ్యగౌడ్, పద్మావతి దంపతుల కుమార్తె అభినేత్రి డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఎస్‌ఏ ఆంగ్లంలో 70.27 మార్కులతో జిల్లా ద్వితీయ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆమె వనపర్తి కస్తూర్బాలో పీజీ సీఆర్టీగా పని చేస్తున్నారు.

రవికిరణ్ గౌడ్‌కు రెండు ఉద్యోగాలు



మదనాపురం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మదనాపురం మండలం దుప్పల్లి గ్రామానికి చెందిన ఆకుల రవికిరణ్ గౌడ్ ప్రతిభ చాటి రెండు ఉద్యోగాలు సాధించాడు. పీడీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకుతో పాటు పీఈటీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం రవికిరణ్ గౌడ్ మహాత్మాజ్యోతిబా ఫులే గురుకుల పాఠశాల (పెద్దమందడి)లో ఫిజికల్ డైరెక్టర్‌గా (పీడీ) విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు మహదేవగౌడ్, పద్మ, గ్రామస్థులు అభినందించారు.


హైదరాబాద్ టాపర్ తెల్లరాళ్లపల్లి వాసి



పాన్‌గల్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన మంత భాస్కర్ ఎస్జీటీలో హైదరాబాద్ జిల్లాలో మొదటి, ద్వితీయ ర్యాంకు సాధించాడు. 87.47 మార్కులతో తెలుగు మాధ్యమంలో ప్రథమ, ఆంగ్ల మాధ్యమంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తల్లి నాగలక్ష్మి దర్జీగా పని చేస్తుండగా, తండ్రి నరసింహ వ్యవసాయం చేస్తుంటారు. వీరికి ముగ్గురు సంతానం. భాస్కర్ రెండో కుమారుడు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడంతో ఆ కుటుంబ ఆనందం అంత ఇంతకాదు. ప్రణాళికాబద్ధంగా చదవడం, కుటుంబ సభ్యుల సహకారంతో ర్యాంకు సాధ్యమైందని భాస్కర్ తెలిపారు.

మారథాన్‌లో పతకం


అమరచింత, న్యూస్‌టుడే : జర్మనీ దేశంలోని బెర్లిన్ నగరంలో సెప్టెంబరు 29న నిర్వహించిన 5, 10 కి.మీ. మారథాన్ పోటీల్లో తెలంగాణ పోలీస్ శాఖ నుంచి మండలంలోని మస్తిపూర్ గ్రామానికి చెందిన ఐజీ ఎం.రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు. 161 దేశాల నుంచి 58,212 మంది పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు 10 మందిని పతకాలకు ఎంపిక చేయగా.. అందులో ఐజీ రమేశ్‌రెడ్డి ఉన్నారు. ఈయన పతకం సాధించడంతో గ్రామ యువకులు సంబరాలు చేసుకున్నారు.



పతకం సాధించిన ఐజీ ఎం.రమేశ్‌రెడ్డి

రుణమాఫీని జీర్ణించుకోలేని విపక్షాలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.రెండు లక్షల రుణాలు మాఫీ చేస్తే విపక్షాలు జీర్ణించుకోవడం లేదని పుర అధ్యక్షుడు పుట్టపాకల మహేశ్ అన్నారు. సోమవారం వనపర్తిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాజన సభకు ఆయన హాజరై మాట్లాడారు. సింగిల్ విండో ఛైర్మన్ వెంకట్రావు మాట్లాడుతూ గతంలో తీసుకున్న రుణాలు మాఫీ కావడంతో కొత్త రుణాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సింగిల్‌విండో ఛైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పుర అధ్యక్షుడు పుట్టపాకల మహేశ్

పిల్లల అలవాట్లను తల్లిదండ్రులు గమనించాలి

పెబ్బేరు, న్యూస్‌టుడే: పిల్లల అలవాట్లను తల్లిదండ్రులు గమనించాలని యాపర్ల పాఠశాల జీహెచ్‌ఎం శంకర్‌గౌడ్ సూచించారు. బడి నిద్ర కార్యక్రమం పేరుతో సోమవారం రాత్రి ఆయన ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల ఇంటింటికి వెళ్లి వారి చదువుపై ఆరా తీశారు.



మాట్లాడుతున్న ప్రత్యేక కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూసేకరణ సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: గణప సముద్రం భూ సేకరణ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని జిల్లా ప్రత్యేక కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఖిల్లాగణపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముంపు బాధితుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గణప సముద్రంలో ముంపునకు గురవుతున్న 388 మంది రైతులతో అవార్డు విచారణలో భాగంగా రైతుల ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకాల పరిశీలన కోసం వచ్చామని రైతులు సహకరించాలని కోరారు. స్పందించిన వారు పరిహారం విషయం తేల్చకుండా పాస్‌పుస్తకాలు ఎలా ఇస్తామని కలెక్టర్‌ను ప్రశ్నించారు. గణప సముద్రం అలుగు ఎత్తును రెండున్నర పీట్లు పెంచడంతో ఖిల్లాగణపురం గ్రామం మునిగి పోతుందని అలుగు ఎత్తును ఒక ఫీట్ మాత్రమే పెంచాలని సూచించారు. గ్రామం ముంపునకు గురికాకుండా రక్షణ గోడను నిర్మించి రైతులకు పరిహారంగా రూ. 25లక్షలు ఇవ్వాలని రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగైతేనే జలాశయం నిర్మాణానికి ఒప్పుకొంటామని ముంపు రైతులు తేల్చి చెప్పారు. స్పందించిన స్పెషల్ కలెక్టర్ ప్రభుత్వం రూ.లు 5లక్షల నుండి రూ.లు 7లక్షల వరకు పరిహారం ఇవ్వనుందని, రైతుల డిమాండ్‌ల విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

తీగలు తాకి విద్యుదాఘాతంతో ఒకరి మృతి

వీపనగండ్ల (చిన్నంబావి), న్యూస్‌టుడే : పొలంలోకి అడవి పందులు రాకుండా ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు తాకి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సంగినేనిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై కె.రాణి తెలిపిన వివరాల ప్రకారం.. సంగినేనిపల్లికి చెందిన పరమేశ్ అడవి పందుల నుంచి తన మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు ఇనుప తీగలతో కంచె పెట్టి వాటికి రాత్రి సమయంలో విద్యుత్తు సరఫరా చేసేవారు. ఈ క్రమంలో మండలంలోని వల్లభాపురం తండాకు చెందిన కాట్రావత్ నారాయణ (58) సోమవారం తెల్లవారు జామున పొలాల వెంట నడుచుకుంటూ సంగినేనిపల్లికి వెళ్తున్నారు. పరమేశ్ తన పొలానికి ఏర్పాటుచేసిన తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై సంఘటన స్థలంలోనే ఆయన మృతి చెందారని ఎస్సై తెలిపారు. పొలానికి అక్రమంగా విద్యుత్తు తీగలను పెట్టిన పరమేశ్‌పై కేసునమోదు చేశామని ఆమె తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ నాగభూషణం రావు పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.



కాట్రావత్ నారాయణ

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఓ షోరూం దగ్గర ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. . బైపాస్ నుంచి వస్తున్న ట్రాక్టర్ ఎద్దులబండిని క్రాస్ చేయబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గద్వాల మండలం ధరూర్‌కి చెందిన దవూల్‌కి గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

జీఈసీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తి జిల్లా జీఈసీవోగా నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న సుబ్బలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భరత్, బీసీ సంఘం నాయకులు అంజియాదవ్, మహేందర్, రవి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని మిట్టనందిమల్ల గ్రామానికి చెందిన సునీతకు నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంకు చెందిన రాజుతో పదేళ్ల కిందట వివాహం అయింది. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. కొంతకాలంగా రాజు కొట్టడం, మానసికంగా, శారరీరకంగా హింసించి క్షోభకు గురి చేస్తున్నాడని సోమవారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై బి.సురేశ్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి నాలుగు సంవత్సరాల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానాను న్యాయమూర్తి విధించారని వనపర్తి సీఐ నాగభూషణంరావు తెలిపారు. పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన మునిస్వామి, శేఖర్ మధ్య పాత గొడవలున్నాయి. 1 ఫిబ్రవరి 2024న మునిస్వామి ఇంటి వద్ద మురుగుకాల్వ విషయంలో మునిస్వామి, శేఖర్ గొడవపడ్డారు. శేఖర్ గొడ్డలితో మునిస్వామి భార్య మైబుసమ్మ తలపై దాడి చేశారు. ఆమెకు రక్తగాయాలయ్యాయి. అడ్డుకోబోయిన మునిస్వామిపై శేఖర్ దాడి చేశారు. అప్పట్లో కేసు నమోదైంది. కేసు విచారణ అనంతరం వాదోపవాదాలు విన్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రజని నేరస్థుడు శేఖర్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమాన విధించారని సీఐ తెలిపారు.

ఇన్‌స్పైర్ దరఖాస్తుల నమోదుపై అవగాహన

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుల కోసం చరవాణిలో ఆన్‌లైన్ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించినట్లు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుల ఆన్‌లైన్‌లో నమోదుపై శ్రీనివాస్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఎలా చేయాలో వివరిస్తున్న జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం



నిరసన కార్యక్రమంలో భారాస నాయకులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ఇచ్చిన రుణమాఫీ హామీని అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని భారాస నాయకులు విమర్శించారు. సోమవారం భారాస మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాష్ చౌరస్తా వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పుర అధ్యక్షురాలు కరుణశ్రీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడిచినా పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ కాకపోవడంతో అన్నదాతలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా తీసుకొచ్చి పేదలను ఇబ్బంది పెడుతూ, ఆర్థికంగా ఉన్న వాళ్లను వదిలేస్తున్నారని విమర్శించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ లక్ష్మీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పుర ఉపాధ్యక్షుడు కర్రెస్వామి, నాయకులు చిన్నఎల్లారెడ్డి, వెంకటేశ్, గుడిసె వేణు, సాయినాథ్, వెంకటేశ్ గౌడ్, గోవిందు, వడ్డె రమేశ్ పాల్గొన్నారు.

లడ్డూ కల్తీపై నిరసన

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ కల్తీపై విశ్వ హిందూ పరిషత్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయం వద్ద వీహెచ్‌పీ, భాజపా నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు.

మొక్కలు నాటిన జితేందర్‌రెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న దిల్లీల్లో రాష్ట్రప్రభుత్వ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలిక పరిధిలోని ఖానాపురం గ్రామంలో రెవెన్యూశాఖ ఎస్టేట్ అధికారి (ఆర్డీవో) చంద్రకళ తన తల్లి అనంతమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉద్యానవనంలో సోమవారం దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంద్రకళ ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ నాగరాజుగౌడ్, కౌన్సిలర్ చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతయ్య, అయ్యూబ్‌ఖాన్, భగవంతు, వంశీ, శ్రీకాంత్, ఎండీ రఫీక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: మండలంలోని ఏదుల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థి ఎస్.గాయత్రి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గద్వాలలో జరిగిన ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలో ప్రతిభను కనబరచడంతో ఆమెను జిల్లా జట్టుకు ఎంపిక చేశారని హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. అక్టోబరు 6 నుంచి 8వరకు మెదక్ పట్టణంలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో గాయత్రి పాల్గొంటుందని తెలిపారు.

పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో సోమవారం పీఆర్టీయూ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొత్తకోట మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు నియమితులయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా శివకుమార్, మహిళ విభాగం ఉపాధ్యక్షురాలిగా మునేంద్రమ్మ, కార్యదర్శులుగా రాములు, కవితారాణిని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యవర్గం తెలిపింది.



సత్యనారాయణ, బాలరాజు

కొత్తకోట పుర కమిషనర్‌గా పవన్‌కుమార్

కొత్తకోట,న్యూస్‌టుడే: కొత్తకోట పురపాలక సంఘం కమిషనర్‌గా పవన్‌కుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ పురపాలికలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి ఇక్కడి బదిలీపై ఆయనకు పుర అధికారులు, పలువురు స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న సూర్యకుమార్ పదవీ విరమణ పొందగా ఆయనకు పురవాసులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.

ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక

ధన్వాడ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపికల్ని ఎస్‌జీఎఫ్ అధికారులు పూర్తి చేశారు. 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో 30 నుంచి 62 కిలోల బరువు పరిధిలో నందిని, నిఖిత, సీతామహలక్ష్మి, శిరీష, ప్రియమణి, మౌనిక, గంగమ్మ, కీర్తి ఎంపికయ్యారు. 17 ఏళ్ల విభాగంలో నేహశ్రీ, శిరీష, జె.శిరీష, బాలమణి, జగదీశ్వరి, శివరంజని, సఫేరా, సోనమ్మలు ఉన్నారు. 19 ఏళ్ల విభాగానికి సంబంధించి 50 నుంచి 53 కిలోల బరువు పరిధిలో గీతా, రజిత, గీత, సాయి వైష్ణవి ఎంపికయ్యారు. బాలర 14 ఏళ్ల విభాగంలో 35 నుంచి 68 కిలోల పరిధిలో అఖిల్, రాకేష్, కుమార్, ప్రవీణ్, నరేందర్, జగన్ నాయక్, రోషన్, అరవింద్ వెంకటేష్‌లు ఎంపిక కాగా 17 ఏళ్ల విభాగంలో భాను, రాజేష్, నందు, మధు, మహేష్, ప్రవీణ్‌నాయక్. గిరి ఎంపికయ్యారు. 19 ఏళ్ల విభాగంలో జె.అరుణ్, చరణ్‌నాయక్, పవన్, ముకుందలు ఎంపికయ్యారు.

4 రోజుల అనంతరం లారీల విడుదల

రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : రేవల్లి మండలం నుంచి పలుగురాళ్లను శ్రీకాకుళానికి తీసుకెళ్తున్న నాలుగు లారీలను గురువారం రాత్రి కొందరు వ్యక్తులు పట్టుకుని తహసీల్దారుకు సమాచారం ఇవ్వగా ఆమె వాటిని పోలీసులకు అప్పగించారు. అప్పటి నుంచి నాలుగు లారీలు రేవల్లి పోలీసుల ఆధీనంలో ఉన్నాయి. పలుగురాయిని తరలించడానికి అనుమతులు లేవని తెలిసి వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, ఈవిషయంలో పూర్తి పత్రాలను పరిశీలించి నిర్ణయం తెలియజేయాలని తహసీల్దారు లక్ష్మీదేవి జిల్లా కలెక్టరుకు లేఖ రాశారు. ఆయన అన్ని పత్రాలను పరిశీలించిన తర్వాత అనుమతులన్నీ కరెక్టుగానే ఉన్నాయని చెప్పడంతో సోమవారం తహసీల్దారు లారీలను విడుదల చేయాలని పోలీసులకు లేఖ అందించారు. నాలుగు రోజులుగా రేవల్లి పోలీస్ స్టేషన్‌లో ఉన్న లారీలను సోమవారం విడిచిపెట్టినట్లు ఎస్సై రాము తెలిపారు.

బీమాపై ప్రజలకు అవగాహన

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కడుకుంట్ల గ్రామంలో సోమవారం గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు బీమాపై ప్రజలకు అవగాహన కల్పించారు. అకాల పరిస్థితుల్లో ఆసరాగా ఉంటుందని రీజనల్ మేనేజరు రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. అనంతరం మృతుడు బోయ వెంకటేశ్ భార్య బాలకిష్టమ్మకు రూ. 20 లక్షల బీమా చెక్కు అందజేశారు.

విద్యార్థులు వ్యసనాలకు దురంగా ఉండాలి

పాన్‌గల్, న్యూస్‌టుడే : విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పెంచుకుని, వ్యసనాలకు దూరంగా ఉండి చదువుకుంటేనే భవిష్యత్తులో ఎదుగుతారని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సోమవారం పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సంతమా ఊరి సంత పాట పాడి విద్యార్థుల్లో జోష్ నింపారు. కార్యక్రమంలో యూటీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గంగయ్య, ఎంఈవో శ్రీనివాసులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే భూ సమస్యలకు పరిష్కారం

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : పోరాటాలతోనే గిరిజనుల భూ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముందరి తండా శివారులో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మాజీ ఎంపీపీ 410 మంది రైతులను గుర్తించి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌ను వినతి పత్రాలిస్తే ఓఆర్‌సీని రద్దు చేసి టెనెంట్ 38ఈ యాక్ట్ ప్రకారం అవి పరిశీలన చేయకుండా అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. 410 మంది గిరిజన భూ హక్కుదారు రైతులకు ప్రభుత్వం పట్టాలివ్వాలని లేదంటే రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ, జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు దేవన్న, ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

రైతులకు అండగా సహకార సంఘం

కొత్తకోట, న్యూస్‌టుడే: అన్నదాతలు ఆర్థిక ప్రగతిని సాధించేలా వ్యవసాయ పరపతి సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ డైరెక్టర్, కొత్తకోట విండో అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం వ్యవసాయ పరపతి సంఘంలో నిర్వహించిన మహజన సభలో ఆయన మాట్లాడారు. సంఘం పరిధిలో 494 మంది రైతులకు రూ.2.97 కోట్ల రుణమాఫీ వచ్చిందన్నారు. ఇంకా రుణమాఫీ కోసం కొంతమంది రైతులు ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. కొత్తగా 58 మందికి రూ.40 లక్షల రుణాలు అందజేశామన్నారు. వ్యవసాయేతరులకు వ్యాపారాభివృద్ధి కోసం రుణాలు అందజేస్తున్నామని ఇందు కోసం ఇప్పటికే 2.53 కోట్లు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించడం లేదని గురుకుల పాఠశాలకు తాళం

ఇటిక్యాల, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు అద్దె చెల్లించడం లేదంటూ భవనం యజమాని గేటుకు తాళం వేసిన ఘటన ఎర్రవల్లి మండలంలో చోటుచేసుకుంది. 10 నెలలుగా అద్దె చెల్లించలేదని అడిగిన ప్రతిసారి రెండు మూడు రోజుల్లో చెల్లిస్తామంటూ గురుకుల అధికారులు కాలం గడుపుతున్నారని ఆరోపించారు. దీంతో సోమవారం ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెల్లకుండా గేటుకు తాళం వేశారు. ఈ విషయంపై ఉపాధ్యాయులు జోనల్ అధికారి రజిని దృష్టికి తీసుకెళ్లగా భవనం యజమానితో చరవాణిలో మాట్లాడారు. బిల్లులు ప్రభుత్వానికి సమర్పించామని రెండు రోజులలో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తాళం తీశారు.



గేటుకు తాళం వేసి పాఠశాల ఎదుట నిల్చున్న భవనం యజమాని

మైక్‌సెట్ వితరణ

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: వనపర్తికి చెందిన వ్యాపారవేత్త ఎస్‌ఎల్‌ఎన్ రమేశ్ గోపాల్‌పేట ఉన్నత పాఠశాలకు సోమవారం రూ.11 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ప్రార్థన, ఆటల పోటీల సమయంలో, పాఠశాల విద్యార్థులతో సమావేశాలప్పుడు దీనిని ఉపయోగించుకోవచ్చని హెచ్‌ఎం రమాకాంత్ అన్నారు. రమేశ్‌ను సత్కరించారు.

చేనేత కార్మికుల జీవన విధానంపై అవగాహన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమరచింత, న్యూస్‌టుడే : చేనేత కార్మికుల జీవన విధానంపై పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం వారిని అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సంఘం వద్దకు ఉపాధ్యాయులు అనురాధ, అగ్రిపా తీసుకెళ్లి చేనేత వస్త్రాల తయారీ, కావాల్సిన ముడిసరకులు, సంపాదన, జీవన విధానం, సమస్యలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కృష్ణవేణమ్మ, బి.సునీత పాల్గొన్నారు.

అమ్మ యాప్‌పై శిక్షణ

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు అమ్మ యాప్‌పై సోమవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి ఝాన్సీరాణి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి బిడ్డల సంరక్షణకు యాప్ ప్రత్యేకంగా రూపొందించారన్నారు. గర్భిణుల పరిస్థితులను గుర్తించి త్వరగా చికిత్స అందించడం ద్వారా మాతా శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల, డాక్టర్ హరినాథ్ రెడ్డి, నర్సింగ్‌రావు, వెంకటకృష్ణారెడ్డి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అనుమానాస్పద వాహనాల్లో వస్తే సమాచారమివ్వండి

పెబ్బేరు, న్యూస్‌టుడే: అనుమానాస్పద వాహనాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. సోమవారం రాత్రి పట్టణం లోని చెలిమిల్లలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. చెలిమిల్లలో 50 వాహనాలను తనిఖీ చేసి వాటిలో ఎలాంటి పత్రాలు లేని 4 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ వాహనాలకు తప్పని సరిగా పత్రాలు ఉండాలన్నారు. ప్రతి కాలనీలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని.. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని, అవకాశం ఉన్న వారు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొత్తకోట, ఆత్మకూరు సీఐలు రాంబాబు, శివకుమార్, పలు ఠాణాల ఎస్సైలు, 50 మంది పోలీసులు పాల్గొన్నారు.



పెబ్బేరులో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

కార్మిక చట్టాలు అమలు చేయాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఒప్పంద, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వనపర్తిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికులతో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్లరాజు, నాయకులు నిక్సన్, రమేశ్, ఎన్.రాములు, మద్దిలేటి, ఒప్పంద, అవుట్ సోర్సింగ్, ఉద్యోగులు, పంచాయతీ కార్మికులు, హమాలీ యూనియన్, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.



వనపర్తి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, వనపర్తి

E.P. No. 119 of 2014

Between:
శ్రీమతి A.రాజేంద్రమ్మ ...D.Hr
మరియు
గుంటి బాలరాజు ...J.Dr

To,
గుంటి బాలరాజు S/o గుంటి దానయ్య, వయసు: 40 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం & బిజినెస్, R/o గోవర్ధనగిరి గ్రామం, వీపనగండ్ల మండలం.

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయటం ఏమనగా పై తెలిపిన D.Hr తనకు O.S.No. 49 of 2012 ద్వారా రావలసిన డిక్రీ డబ్బుల కొరకు పై తెలిపిన కోర్టు యందు పై E.P. వేసి ఉన్నారు. J.Dr డిక్రీ డబ్బులు చెల్లించనందువలన కోర్టు వారు J.Drకు చెందిన క్రింది E.P. షెడ్యూల్‌లో చూపిన ఆస్తిని అమ్మడానికి తేది 17-10-2024 నాడు పై తెలిపిన కోర్టునందు ఉదయం గం. 10-30ని లకు వేలం వేయుచున్నారు. కావున ఆసక్తి కలవారు పై కోర్టులో తేది. 17-10-2024 ఉదయం గం. 10-30ని లకు వేలంలో పాల్గొనగలరు.

వేలం వేయు ఆస్తి

Sy.No. 329A3లో గల ఎకరాలు 4-00 గుంటలు భూమి గోవర్ధనగిరి గ్రామ శివారు, వీపనగండ్ల మండలంలో కలదు. దీనికి హద్దులు ఉత్తరం: కృష్ణయ్య భూమి, దక్షిణం: చిన్నయ్య భూమి, తూర్పు: బిచ్చన్న భూమి మరియు పడమర: చిన్నయ్య భూమి, ఇట్టి ఆస్తి విలువ D.Hr. అంచనా రూ. 4,00,000/- ఆస్తి విలువ కోర్ట్ ఫీల్డ్ అసిస్టెంట్ గారి రిపోర్ట్ ప్రకారము మొత్తం ఆస్తి విలువ ఒక ఎకరాకు రూ. 1,87,500/-

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఇట్లు

పి.శ్రీరాంరావు, పి.మన్మోహన్ రావు, డి.అశోక్ రావు, పి.వనజా దేవి, టి.శిరీష్ చంద్ర ప్రసాద్, ఎస్.రమేష్, పి.రఘు వంశీ, ఎ.భరత్ కుమార్, న్యాయవాదులు, వనపర్తి. Cell: 9440465174, 9396800343